క్లుప్తంగా

విజయసాయిరెడ్డికి సత్కారం



విజయసాయిరెడ్డిని సత్కరిస్తున్న శ్రీధర్, బానాల

విశాఖ విద్య: వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కో–ఆర్డినేటర్ విజయసాయిరెడ్డిని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ గురువారం పార్టీ కార్యాలయంలో కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి గజమాలతో ఘనంగా సత్కరించారు. విజయసాయిరెడ్డి సారథ్యంలో పార్టీ పూర్వవైభవం దిశగా ముందుకెళ్తుందన్నారు. కూటమి ప్రభుత్వం చాలా చోట్ల పార్టీ కార్యకర్తలను వేధింపులకు గురిచేస్తోందని, వారందరికీ భరోసాగా కల్పించేలా రానున్న రోజుల్లో క్షేత్ర స్థాయి పర్యటనలకు శ్రీకారం చుట్టాలని సూచించినట్లు శ్రీధర్ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరకుల ధరలు తగ్గించాలని ధర్నా



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

విశాఖ విద్య: నిత్యావసర సరకుల ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో గోపాలపట్నం మండలం ఇందిరానగర్ వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. సీపీఎం జోన్ నాయకుడు బి.వెంకటరావు మాట్లాడుతూ రోజు రోజుకు నిత్యావసర ధరలు పెరుగుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వీటిపై ఏమాత్రం దృష్టిపెట్టడం లేదన్నారు. నిత్యావసర ధరలకు తోడు, విద్యుత్ చార్జీలను కూడా పెంచటంతో సామాన్యులు బతకలేని పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. ప్రభుత్వం ధరల తగ్గించేందుకు చర్యలు తీసుకోకుంటే, ప్రజా సంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామన్నారు.

సాయిబాబాకు ప్రత్యేక పూజలు



సాయిబాబా

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు ఏపీఎస్ఈబీ కాలనీ శ్రీ షిర్డీ సాయిబాబా ధ్యాన మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం బాబాకు పంచామృతాలతో అభిషేకం జరిపించారు. ప్రత్యేక అలంకరణ అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. భక్తుల గోత్రనామాలతో అర్చకులు పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. సాయంత్రం బాబాకు ప్రత్యేక హారతులు ఇచ్చారు. సాయి సంకీర్తనలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పల్లకీ సేవ వైభవోపేతంగా జరిపించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు విశ్లా సత్యనారాయణ రావు ఆధ్వర్యంలో తగిన ఏర్పాట్లు చేశారు.

నెట్‌బాల్ క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్లు అందజేత



క్రీడా దుస్తులు, పరికరాలతో క్రీడాకారులు, విందుల వెంకటరమణ తదితరులు

అగనంపూడి : కణితి హైస్కూల్‌లో ఈ నెల 9 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీల క్రీడాకారులకు విశాఖ ఉక్కు ఉద్యోగి విందుల వెంకటరమణ క్రీడా దుస్తులు, స్పోర్ట్స్ కిట్లు అందించారు. పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అండర్ – 14 బాలురు, బాలికల జట్లకు వీటిని అందించారు. ఈ సందర్భంగా వార్డు కార్పొరేటర్ బొండా జగన్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో పోటీల నిర్వహణకు తమ సహకారం ఉంటుందన్నారు. క్రీడా దుస్తులు, మెటీరియల్ అందించిన వెంకటరమణను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సూర్యప్రకాశరావు, పాఠశాల ఫిజికల్ డైరెక్టర్లు ఎం.మన్నాజీ, నారాయణరావు పాల్గొన్నారు.

భయపెడుతున్న బీఆర్‌టీఎస్ డక్ట్‌లు



ఇండస్ట్రియల్ ఎస్టేట్ కేవీ పాఠశాల రహదారిలో అసంపూర్తిగా వదిలేసిన డక్ట్

అధికారుల నిర్లక్ష్యం, పారిశుధ్య సిబ్బంది నిర్లిప్తత పాదచారులకు, వాహనదారులకు ఇక్కట్లు తెచ్చిపెడుతున్నాయి. జీవీఎంసీ 56, 57 వార్డుల పరిధిలో బీఆర్‌టీఎస్ రోడ్డుకు ఇరువైపులా చేపట్టిన డక్ట్‌లు కొన్ని చోట్ల అసంపూర్తిగా నిలిచిపోయాయి. మరి కొన్ని చోట్ల పూడిక తొలగింపు కోసం పారిశుధ్య సిబ్బంది పలకల్ని పక్కకు నెట్టేశారు. దీంతో స్థానికుల రాకపోకలకు ఇవి ప్రమాదకరంగా మారాయి. అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవట్లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

- ఓపెన్ డ్రైన్లుగా మారుతున్న వైనం
- తరచూ వాహన చోదకులకు ప్రమాదాలు
- పారిశుధ్య కార్మికుల తీరుతో పైకప్పు లేని డ్రైన్లు
- ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోని యంత్రాంగం



కంచరపాలెం కూడలిలో అసంపూర్తిగా వదిలేసిన డక్ట్

కంచరపాలెం: బీఆర్‌టీఎస్ రోడ్డు నిర్మాణ సమయంలో ఏర్పడ్డ ఇబ్బందులతో కొన్ని చోట్ల రోడ్లకు ఇరువైపులా పైప్‌లైన్లకు, డ్రైన్లకు వీలుగా చేపట్టిన డక్ట్‌ల నిర్మాణం పూర్తి కాలేదు. దీంతో జీవీఎంసీ 56, 57 వార్డుల పరిధి కంచరపాలెం–ఊర్వశికూడలి, ఐటీఐ జంక్షన్, 104 ఏరియా, మర్రిపాలెం వరకు ఉన్న బీఆర్‌టీఎస్ డక్ట్‌లు, మురుగు కాల్వలు ప్రమాద నిలయాలుగా మారాయి. చెత్తాచెదారంతో నిండిపోతున్న వీటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేయడంలో పారిశుధ్య సిబ్బంది నిర్లక్ష్యం పరాకాష్టకు చేరింది. దీంతో ఆయా ప్రాంతాల్లో పాదచారులు, వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు.

ఓపెన్ డ్రైన్లతో అవస్థలు

కంచరపాలెం–ఊర్వశి కూడలి సమీపంలోని జోన్–5 కార్యాలయ రహదారి, ఆర్పీపేట స్కూల్, కంచరపాలెం ఫ్లైఓవర్ వంతెన రహదారి, దుర్గానగర్, గొల్లకంచరపాలెం, ఊర్వశి కూడలి, కంచరపాలెం రైతుబజార్, కళాశాల, పాఠశాలల దిగువ ప్రాంతాల్లో మురుగు కాల్వలు కూడా పారిశుధ్య కార్మికుల తీరుతో ప్రమాదకరంగా మారాయి. ఈ కాల్వల నుంచి పూడికలు తొలగించేందుకు వాటిపై నున్న పలక(మూత)లను తొలగించారు. పూడిక తీశాక వాటిని తిరిగి కాల్వపై సక్రమంగా అమర్చాల్సిన జీవీఎంసీ సిబ్బంది ఆ పని తమది కాదన్నట్టు వదిలేశారు. దీంతో చాలా చోట్ల ఓపెన్ డ్రైన్లుగా మారాయి. వీటిపై సంబంధిత అధికారులు దృష్టి సారించి, సత్వర చర్యలు తీసుకోవాలని స్థానికులు, పాదచారులు కోరుతున్నారు.

అసంపూర్తి డక్ట్‌లతో ప్రమాదాలు

బీఆర్‌టీఎస్ అసంపూర్తి పనులు, కొన్ని చోట్ల డక్ట్‌లపై పైకప్పు నిర్మించకపోవడం, మరి కొన్ని చోట్ల తొలగించిన పలకలను సక్రమంగా వేయకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కంచరపాలెం మెయిన్‌రోడ్డు నుంచి ఊర్వశికూడలి, మర్రిపాలెం పరిసరాల్లో పరిస్థితి దారుణంగా ఉంది. పలకలు ఓ చోట ఏర్పాటు చేసి, మరో చోట వదిలేయడంతో డక్ట్‌లనే ఫుట్‌పాత్‌లుగా వినియోగిస్తున్న చోట పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని చోట్ల వీటిపై నాసిరకం పలకలు వేయడంతో పెద్దపెద్ద రంధ్రాలు ఏర్పడ్డాయి. ఎవరైనా పొరపాటున వాటిలోకి జారితే ప్రాణాలపై ఆశ వదులుకోవాల్సిందే.



104 ఏరియాలో ప్రమాదభరితంగా డక్ట్

అసంపూర్తిగా వదిలేశారు



కంచరపాలెం బీఆర్‌టీఎస్ రహదారుల్లో డక్ట్‌లు అసంపూర్తిగా వదిలేశారు. ఏళ్లు గడుస్తున్నా ఈ రహదారిలో వీటిని పూర్తిచేయలేదు. దీంతో తరచూ ఇక్కడ వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. గ్రీవెన్స్‌ల్లో పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. డక్ట్‌ల నిర్మాణ పనులు పూర్తి చేసి, రహదారులను వినియోగంలోకి తీసుకురావాలి.

– వై.శ్రీనివాసరావు, కంచరపాలెం

కోర్టు కేసులతో పనుల పెండింగ్



బీఆర్‌టీఎస్ రహదారుల అభివృద్ధికి రోడ్ల విస్తరణ చేసినప్పుడు బాధితులు టీడీఆర్ రూపంలో నష్టపరిహారం తీసుకున్నారు. మరికొంత మంది నష్టపరిహారం సరిపోదంటూ కోర్టును ఆశ్రయించారు. ఇలాంటి కేసుల్లో ఉన్న భవనాలు తొలగించక పోవడంతో డక్ట్‌ల నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి. వారు కూడా సహకరిస్తే అసంపూర్తి నిర్మాణాలు పూర్తి చేస్తాం.

– బొడ్డేపల్లి రాము, జోనల్ కమిషనర్, జోన్–5

17న క్రీస్తు రక్షకుని యాత్రా మహోత్సవం



వేడుకల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విచారణ గురువులు

కంచరపాలెం: క్రీస్తు రక్షకుని యాత్రా మహోత్సవాలు ఈ నెల 17న జ్ఞానాపురం రక్షణగిరి పుణ్యక్షేత్రంలో ఘనంగా నిర్వహించనున్నట్లు విశాఖ అర్చ్ డయాసిస్ వికార్ జనరల్ రెవరెండ్ ఫాదర్ డి. బాలశౌరి, రక్షణగిరి డైరెక్టర్ రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్ తెలిపారు. ఈ మేరకు జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ క్యాథడ్రల్ కార్యాలయంలో గురువారం జరిగిన మీడియా సమావేశంలో ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవంబర్ 8 నుండి 16 వరకు నవ దిన ప్రార్థనలు జరగనున్నాయని వెల్లడించారు. రక్షకుని యాత్రా మహోత్సవంలో విశాఖ ప్రావిన్స్ నుండి వెరీ రెవరెండ్ ఫాదర్ భవిరి సురేష్‌బాబు ఆంగ్లంలో పవిత్ర ఆరాధన బోధన, విశాఖ అగ్రపీఠ నూతన గురువులు, ఇతరులచే తెలుగులో సమష్టి దివ్య పూజబలి జరుగుతుందన్నారు. 17 సాయంత్రం ప్రధాన పండగలో విశాఖ అగ్రపీఠ పాలనాధికారి, ఏలూరు పీఠాధిపతులు జయరావుచే సెయింట్ జోసెఫ్ కాన్వెంట్ నుండి రక్షణగిరి వరకు ప్రదక్షిణ జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సహాయ విచారణ గురువులు ఫాదర్ బి.వినయ్‌కుమార్, పి. ఆంథోనీ రాజ్, పీపీసీ అధ్యక్షుడు రాజేష్, సభ్యులు రత్నం, ఫ్రాన్సిస్, ఐతి రవికుమార్, విజయ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

సింహాచలం రైల్వేస్టేషన్‌లో గంజాయి పట్టివేత

విశాఖ విద్య: సింహాచలం రైల్వే స్టేషన్‌లో ఓ ప్రయాణికుడి వద్ద ఉన్న మూడున్నర కేజీల గంజాయిని గోపాలపట్నం పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. ఒడిశాలో గంజాయి కొనుగోలు చేసిన గోపాలపట్నానికి చెందిన బి. ఓంకార్ అనే వ్యక్తి సింహాచలం స్టేషన్‌లో సంచరిస్తుండగా, దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు అతడి వద్ద ఉన్న బ్యాగును తనిఖీ చేశారు. దానిలో గంజాయి లభ్యం కావటంతో అతన్ని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి ఓంకార్‌ను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ కె. సురేష్ తెలిపారు.

గౌరీపరమేశ్వరుల సంబరాలు ప్రారంభం



గౌరీపరమేశ్వరుల ఊరేగింపులో పాల్గొన్న కార్పొరేటర్ సుధ, భక్తులు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు పరిధి రామకృష్ణాపురంలోని శ్రీకోదండరాముని ఆలయంలో శ్రీ గౌరీపరమేశ్వరుల సంబరాలు గురువారం ఘనంగా జరిగాయి. గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రారంభమైన ఉత్సవాలు నెల రోజుల పాటు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. వార్డులోని పలు వీధుల్లో గౌరీ పరమేశ్వరులను మేళతాళాలు, కోలాటాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి పీఠం వద్ద నెలకొల్పారు. వేదపండితుల మంత్రోచ్ఛరణలతో ప్రత్యేక పూజలు జరిపారు. 61వ వార్డు కార్పొరేటర్ కొణతాల హాజరై గౌరీపరమేశ్వరుల ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గౌరీ సేవా సంఘం అధ్యక్షులు కాండ్రేగుల వెంకట రమణ, పాలమరశెట్టి జగ్గారావు, ఆడారి రమణబాబు, కాండ్రేగుల సూర్యనారాయణమూర్తి, శరగడం శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు, మహిళలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ



వెదుళ్లనరవలో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

అగనంపూడి : జీవీఎంసీ 88వ వార్డులో పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవీఎంసీ విలీన గ్రామాల్లో అభివృద్ధికి శ్రీకారం చుట్టామన్నారు. గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీలు, కనీస సౌకర్యాలు కల్పించడానికి ప్రణాళికాయుతంగా చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ సందర్భంగా 88వ వార్డు నంగినారపాడులో రూ.19 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీ, శెట్టివానిపాలెంలో రూ.20 లక్షలతో వరద నీటి కాలువ నిర్మాణం, 39.89 లక్షలతో నరవ శివాలయం రోడ్డు, రూ.20 లక్షలతో కొత్తూరు కాలనీలో సీసీ కాలువ, కల్వర్టు, రూ.39.97 లక్షలతో కొత్తూరు బీసీ కాలనీలో సీసీరోడ్డు, కల్వర్టు, రూ.20 లక్షలతో బీసీ కాలనీలో కమ్యూనిటీ హాలు నిర్మించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మొల్లి ముత్యాలు, నాయకులు వెంకటరమణ, సత్తిబాబు, శ్రీకాంత్, శివ, శ్రీనివాసరావు, పైడిరాజు, సత్యం, తదితరులు పాల్గొన్నారు.

దురలవాట్లతో క్యాన్సర్ ముప్పు



ర్యాలీలో పాల్గొన్న పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది

పెదగంట్యాడ : అనారోగ్య కారక ఆహార అలవాట్లే వల్లే క్యాన్సర్ వస్తుందని దేవాడ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రదీప్ ప్రసాద్‌రాజా అన్నారు. జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకుని జీవీఎంసీ 77వ వార్డు పరిధి దేవాడ గ్రామంలో గురువారం సదస్సు నిర్వహించారు. అనంతరం దేవాడ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రదీప్ మాట్లాడుతూ పిల్లలకు తల్లిపాలు అందించాలని, తద్వారా రొమ్ము క్యాన్సర్ బారిన పడకుండా ఉండవచ్చన్నారు. పొగాకు ఉత్పత్తి వాడకం వల్ల నోటి క్యాన్సర్, ఊపిరితిత్తులు, గర్భసంచి క్యాన్సర్ వస్తాయన్నారు. అందువల్ల వాటికి దూరంగా ఉండాలన్నారు. వ్యాధి సోకితే కనిపించే లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది అన్నపూర్ణ, ఎం.శ్రీనివాసరావు, బి.గోపాలం, ఆర్.రమణమ్మ, బి.విజయభాను, ఎం.దేవి, ముత్యాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ పరీక్షలపై అవగాహన ర్యాలీ



క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీలో వైద్యాధికారి ప్రదీప్ ప్రసాద్‌రాజా తదితరులు

గాజువాక : క్యాన్సర్ పరీక్షలపై గాజువాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) సిబ్బంది గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ నుంచి వంద అడుగుల రోడ్, చినగంట్యాడ గ్రామం వరకు నిర్వహించిన ర్యాలీని ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ ఎం.సుధాకర్‌రావు ప్రారంభించారు. స్క్రీనింగ్‌తో సాధ్యం – క్యాన్సర్‌పై విజయం, క్యాన్సర్ నుంచి రక్ష – ముందస్తు పరీక్ష వంటి నినాదాలతో సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. అనంతరం వైద్యాధికారి మాట్లాడుతూ 18 ఏళ్లు దాటిన స్త్రీ, పురుషులకు ఈ నెల 14 నుంచి ఇంటి వద్దే క్యాన్సర్ సంబంధిత పరీక్షలు నిర్వహిస్తామన్నారు. సీహెచ్‌వో పి.నాగ అప్పారావు మాట్లాడుతూ క్యాన్సర్ పరీక్షలపై సందేహాలు వద్దని, నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. 18 ఏళ్లు నిండిన వారు స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు జి.రాము, బి.రత్నం, తదితరులు పాల్గొన్నారు.

ఇబ్బందులు లేకుండా వైన్‌షాపులు కేటాయించాలి

తాటిచెట్లపాలెం : మద్యం షాపుల కేటాయింపులో కల్లు గీత వృత్తిదారులకు ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఉత్తరాంధ్ర యాత సంక్షేమ, సాంస్కృతిక సేవా సంఘం అధ్యక్షుడు పిల్లి నూకరాజు కోరారు. నరసింహనగర్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ జీవో జారీ చేసే ముందు కొన్ని అంశాలు పరిగణనలోకి తీసుకోవాలన్నారు. రిజర్వేషన్ ద్వారా రిటైల్ షాపులు కేటాయించిన ప్రాంతంలో నివసించే గీత వృత్తి కులస్తుల ధ్రువీకరణ పత్రాన్ని అర్హతగా పరిగణించాలని కోరారు. వైన్ షాపుల లైసెన్స్ ఫీజు రూ.10 వేల లోపు ఉండేలా చూడాలన్నారు. గీత వృత్తిదారులను ధనికులు, రాజకీయ నాయకులు ప్రలోభపెట్టి బినామీలుగా మారకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. గౌడ, శెట్టిబలిజ, ఈడిగ, యాత, శ్రీశయన కులస్తులతో ఓ కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు. బసరమాని ఈశ్వరరావు, సంపంగి మంగరాజు, సమ్మా గోవింద, నోట్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సదస్సు జయప్రదం చేయండి



సమావేశంలో పాల్గొన్న ఏఐఎఫ్‌టీయూ (న్యూ) నాయకులు

గాజువాక : పారిశ్రామిక, వ్యవసాయ రంగాల్లో సంక్షోభం, కార్మికవర్గ కర్తవ్యాలు అనే అంశంపై ఈ నెల 9న స్థానిక శ్రామికనగర్‌లో నిర్వహించనున్న సదస్సును జయప్రదం చేయాలని అఖిలభారత కార్మిక సంఘాల సమాఖ్య (ఏఐఎఫ్‌టీయూ – న్యూ) రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ పండా కోరారు. గాజువాకలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని వివిధ పరిశ్రమల పరిస్థితి, ప్రభుత్వాల తీరుపై ఈ సదస్సులో వక్తలు ప్రసంగిస్తారన్నారు. పరిశ్రమలతోపాటు వ్యవసాయ రంగాన్ని, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను కాపాడుకోవాలన్నారు. ఇందుకోసం వివిధ రూపాల్లో పోరాటాలు అవసరమన్నారు. అందులో భాగంగానే తాము సదస్సు నిర్వహిస్తున్నామని, కార్మికులు, ప్రజలు జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జె.కిశోర్‌బాబు, ఆడారి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించకుండా వేధించడం దారుణం



దీక్షా శిబిరంలో పాల్గొన్న కార్మికులు

అగనంపూడి : విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్మికులకు వేతనాలు చెల్లించకుండా వేధిస్తున్నారని, భవిష్యత్‌లో జరిగే పరిణామాలకు కార్మికుల సహనాన్ని పరీక్షిస్తున్న యాజమాన్యమే బాధ్యత వహించాల్సి ఉంటుందని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ అన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలో ఏర్పాటు చేసిన రిలే దీక్షా శిబిరంలో గురువారం ఆయన మాట్లాడారు. 1,365 రోజులుగా దీక్షలు చేస్తున్నా కేంద్ర ప్రభుత్వంలో చలనం లేదని, మరో పక్క యాజమాన్యంపై ఒత్తిడి పెంచి జీతాలు కూడా చెల్లించకుండా చేస్తున్న ప్రభుత్వాలు భవిష్యత్‌లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. కార్మికులకు వేతనాలు చెల్లించకపోవడంతో అసంతృప్తితో రగిలిపోతున్నారని, యాజమాన్యం వైఖరి మార్చుకోకపోతే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటికే కార్మికుల ఆర్థిక ప్రయోజనాల్లో కోత విధిస్తున్న యాజమాన్యం జీతాలు కూడా చెల్లించకపోతే ఎలా బతుకుతారని ప్రశ్నించారు. కార్యక్రమంలో సింటర్ ప్లాంట్, ట్రాఫిక్, ఈఎస్‌డబ్ల్యూఎఫ్, ఎఫ్ఎండీ, ఈఆర్ఎస్, అడ్మిన్ విభాగాల కార్మికులు పాల్గొన్న శిబిరంలో నాయకులు మసేన్‌రావు, రాజబాబు, బొండా అప్పారావు, కర్రి బాబూరావు, ఎస్.శ్రీనివాస్, కాశీ రమణ పాల్గొన్నారు.

ఆరోగ్యానికి జిమ్‌దాబాద్

- ఓపెన్ జిమ్‌లతో అందరూ వ్యాయామం చేసుకునే అవకాశం
- సద్వినియోగం చేసుకుంటున్న ప్రజలు

మురళీనగర్ : ప్రజల్లో ఆరోగ్య స్పృహ పెరిగింది. ఉదయం, సాయంత్రం నడక ప్రతి ఒక్కరి జీవన వేదంగా మారింది. నడకతో పాటు వ్యాయామం చేయాలనే తపన అందరిలోనూ కనిపిస్తోంది. గతంలో వ్యాయామం చేయాలంటే ప్రత్యేకంగా జిమ్‌లకు వెళ్లాల్సి వచ్చేది. ఇందుకు కొంత ఖర్చయ్యేది. ప్రస్తుతం అందుకు భిన్నంగా జీవీఎంసీ ఓపెన్ జిమ్‌లను పార్కుల్లో ఏర్పాటు చేయడంతో ప్రజల కోరిక తీరింది. ఖరీదైన పరికరాలు అన్ని వయసుల వారికి అందుబాటులోకి వచ్చాయి. వయసుతో నిమిత్తం లేకుండా పార్కులో సందర్శకులు, వాకర్స్ తమ ఫిజికల్ ఫిట్‌నెస్‌కు అనుకూలమైన పరికరాలను వినియోగించుకుంటున్నారు.

స్థలం ఉంటే పరికరాల ఏర్పాటు

జీవీఎంసీ పరిధిలోని కాలనీల్లో స్థలం ఉంటే చాలు జిమ్ పరికరాలు ఏర్పాటు చేయడానికి జీవీఎంసీ సిద్ధంగా ఉంది. ప్రతి పార్కులో ఓపెన్ జిమ్ పరికరాలు ఏర్పాటు చేయాలనే ఉన్నతాశయంలో భాగంగా గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో వీటిని అందుబాటులోకి తెచ్చారు. మురళీనగర్‌లోని వాకర్స్ పార్కులో రూ.2 లక్షలతో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయగా, వైశాఖి స్పోర్ట్స్ పార్కులో రూ.3 లక్షలతో ఓపెన్ జిమ్, ప్రశాంతి పార్కులో రూ.5 లక్షలు, బృందావన్ పార్కులో రూ.5 లక్షలు, సుదర్శన్ పార్కులో రూ.5 లక్షలు, హరిత పార్కులో రెండు విడతల్లో రూ.11లక్షలతో 11 జిమ్ పరికరాలు, ఎన్‌జీజీవోస్ కాలనీ వైభవ్ పార్కులో రూ.10 లక్షలతో జిమ్ పరికరాలు ఏర్పాటు చేశారు. ఈ పార్కుల్లో వ్యాయామానికి అవసరమైన అన్ని పరికరాలూ అందుబాటులో ఉన్నాయి. ఇవన్నీ ఐరన్ కమ్ ఫైబర్‌తో, పీవీసీ మెటీరియల్‌తో తయారు చేశారు.

అందరికీ అందుబాటులో పరికరాలు

జిమ్ పరికరాలను ఔట్‌డోర్‌లో ఏర్పాటు చేయడంతో అన్ని వర్గాల వారికి వ్యాయామం చేయాలనే ఆసక్తి కలుగుతోంది. వీటిని ఫుల్‌బాడీ వర్క్ అవుట్‌కు వీలుగా రూపొందించారు. మజిల్ గ్రూప్ యువతకు ఉపయోగపడే పులప్స్, పుషప్స్, లెగ్ ప్రెసెస్‌కు వీలుగా వీటిని ఉపయోగించుకోవచ్చు. ఈ పరికరాల ఏర్పాటుతో ఆరోగ్యకర జీవనం, ప్రజా సంబంధాలు పెరిగాయనే చెప్పవచ్చు. అన్ని వయసుల వారికి ఇవి ఉపయోగకరంగా ఉంటున్నాయి. అందరికీ అందుబాటులో వ్యాయామ పరికరాలు అనే ఆశయాన్ని నెరవేరుస్తున్నాయి. వాకర్స్, సందర్శకుల ఫిజికల్ ఫిట్‌నెస్‌కు అనుగుణంగా వారికి అవసరమైన పరికరాలను ఉపయోగించుకుంటున్నారు. పార్కుల్లో పిల్లలకు ఉపయోగపడే విధంగా ఆట పరికరాలు అందుబాటులో ఉన్నాయి. స్వింగ్స్ (ఊయలలు), సీ – సాస్, స్లైడర్స్ (జారుడుబల్లలు), స్పిన్నర్ అండ్ మెర్రీ గో రౌండ్, క్లైంబర్స్ వంటివి అందుబాటులో ఉన్నాయి.



వైశాఖి స్పోర్ట్స్ పార్కులో వాకింగ్ చేస్తున్న వాకర్లు



బృందావన్ పార్కులో జిమ్ పరికరాలపై వ్యాయామం


బేస్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఏబీఎస్ విద్యార్థిని



రోషిణి

అగనంపూడి : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) 68వ రాష్ట్ర స్థాయి బేస్ బాల్ పోటీలకు జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి సమీపంలోని ఏబీఎస్ పాఠశాల విద్యార్థిని సాలాపు రోషిణి ఎంపికైంది. ఇటీవల నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలు, ఎంపికల్లో రోషిణి సత్తా చాటింది. ఈ నెల 9 నుంచి 11 వరకు తిరుపతిలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో రోషిణి పాల్గొంటుందని పాఠశాల వ్యవస్థాపకులు పి.ఎం.కొండయ్య, ప్రిన్సిపాల్ పద్మజ దీపక్, ఫిజికల్ డైరెక్టర్ ఈశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థినిని ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

వాటర్ ప్యూరిఫైర్ మిషన్ల వితరణ



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు, టీచర్లతో ఎమ్మెల్యే గణబాబు, హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ సభ్యులు

సింధియా: చిన్న పిల్లలు తాగే నీరు శుభ్రంగా, స్వచ్ఛంగా ఉండాలనే ఉద్దేశ్యంతో హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు శివలంక సుధాకర్, యశ్వంత్ అండ్ టీమ్ సభ్యులు నియోజకవర్గంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలకు వాటర్ ప్యూరిఫైర్ మిషన్లు అందజేశారు. ఈ మేరకు జీవీఎంసీ 62వ వార్డు పరిధి గుడివాడ అప్పన్న కాలనీ, దుర్గానగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు ముఖ్య అతిథిగా హాజరై అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన వాటర్ ప్యూరిఫైర్ మిషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ సభ్యుల సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు మద్దిల యశ్వంత్, సభ్యులు దుర్గారావు, నూకరాజు, బాలరాజు, రాజు, సతీష్, సురేష్, రవి, కార్తీక్, స్థానిక టీడీపీ నాయకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.